విలేకరులు కావలెను

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వెలుబడుతున్న

ప్రజా స్వేచ్ఛ

PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక

తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి
+91 9381910611 , 7989289492



www.prajaswecha.com

# ప్రజా స్వేచ్ఛ

PRAJA SWECHA


రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక





హైదరాబాద్ | సంచిక : 1 | సంపుటి : 127 | ఎడిటర్ : తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి | అక్టోబర్ 2024 | వెల : రూ 10/-


## నేటినుంచే గ్రూప్-1 మెయిన్స్




- హెచ్ఎండీఏ పరిధిలో 27 వరకు పరీక్షలు
- ఉత్కంఠకు తెరదించిన ప్రభుత్వం
- ఉద్రిక్త పరిస్థితుల్లోనూ వాయిదా వేయకుండా ముందుకే
- పరీక్షా కేంద్రాల వద్ద పోలీసుల పటిష్ట బందోబస్తు
- మధ్యాహ్నం ఒకటిన్నర వరకే అభ్యర్థులకు అనుమతి
- ఆ తర్వాత గేట్లు మూసివేత
- హాజరుకానున్న 31,383 మంది అభ్యర్థులు

హైదరాబాద్

గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు షెడ్యూల్ ప్రకారమే సోమవారం నుంచి యథాతథంగా జరగనున్నాయి. హెచ్ఎండీఏ పరిధిలో ఈనెల 27వ తేదీ వరకు ఈ పరీక్షలు జరుగుతాయి. అయితే గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలపై చివరి వరకు ఉత్కంఠ కొనసాగింది. ఈ పరీక్షలను వాయిదా వేయాలనీ,

-మిగతా 3 లో

## దేశానికే రోల్‌మోడల్‌గా హైదరాబాద్



- ఐఎస్‌బీ విద్యార్థులు రాష్ట్రంలో పనిచేయాలి
- ధైర్యంగా తీసుకెళ్లాలి
- బ్రాండ్ అంబాసిడర్లు గా మారాలి
- అద్భుతమైన నాలెడ్జ్ ఇస్తాం
- ఐఎస్‌బీ లీడర్‌షిప్ సమ్మిట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్

దేశానికి హైదరాబాద్‌ను రోల్‌మోడల్‌గా నిలపడమే లక్ష్యమని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి అన్నారు. ఇతర రాష్ట్రాలు పట్టణాలతో తాను హైదరాబాద్‌ను పోల్చబోననీ, తన పోటీ న్యూయార్క్, లండన్, పారిస్, టోక్యో, సియోల్‌తోనే అని చెప్పారు. ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) క్యాంపస్‌లో ఆదివారం జరిగిన లీడర్‌షిప్ సమ్మిట్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐఎస్‌బీలో చదువు పూర్తైన విద్యార్థులు తప్పనిసరిగా తెలంగాణలో కనీసం రెండు, లేదా మూడేండ్లు

-మిగతా 3 లో



## ఉత్తర గాజాలో బాంబుల వర్షం

- హిజ్బుల్లా ఇంటెలిజెన్స్ ప్రధాన కార్యాలయంపై బాంబుల వర్షం
- ముగ్గురు కమాండర్లు సహా 76 మంది మృతి

బీరుట్ /గాజా సిటీ

ఇజ్రాయెల్ సైన్యం లెబనీస్ రాజధానిలోని ఇంటెలిజెన్స్ ప్రధాన కార్యాలయం, భూగర్భ ఆయుధాల తయారీ కేంద్రంపైన, ఉత్తర గాజాపైన ఇజ్రాయిల్ క్రూరమైన వైమానిక దాడులు జరిపి ముగ్గురు హిజ్బుల్లా కమాండర్లతో సహా 76 మందిని పొట్టనబెట్టుకుంది. లెబనాన్‌పై జరిపిన

-మిగతా 3 లో



## అనుమతులున్న నిర్మాణాలను హైడ్రా కూల్చేయదు

- బఫర్ జోన్ లోని చట్టబద్ధ నిర్మాణాలను కూల్చం
- హైడ్రా కమిషనర్ ఏవీ.రంగనాథ్

హైదరాబాద్

అనుమతులున్న నిర్మాణాలను 'హైడ్రా' కూల్చివేయబోదని ఆ సంస్థ కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పష్టం చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. చట్టబద్ధమైన

-మిగతా 3 లో

## బోనస్ లేదు.. రైతు భరోసా రాదు




- ఇదేం పాలన..11 నెలల్లో ఒక్క మంచి పనైనా చేసిందా?
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- దేవుళ్ల మీద ఒట్లు వేసి మాట తప్పిన రేవంత్‌రెడ్డి : మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు
- త్వరలోనే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో ఫార్మా గ్రామాలను పర్యటిస్తాం
- రంగారెడ్డి, కరీంనగర్ జిల్లాల్లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో దసరా సమ్మేళనం

రంగారెడ్డి ప్రతినిధి/ తిమ్మాపూర్

గతంలో రెండు పంటలకు కాదు, మూడు పంటలకు రైతు భరోసా ఇవ్వాలని చెప్పిన రేవంత్‌రెడ్డి.. అధికారంలోకి వచ్చాక ఒక్క పంటకు కూడా రైతు భరోసా ఎందుకు ఇవ్వడం లేదని

-మిగతా 3 లో



## పొంచి ఉన్న తుఫాను ముప్పు..

- తెలంగాణలో కొనసాగనున్న వానలు..
- ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ

హైదరాబాద్

తెలంగాణలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కొనసాగుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. ఉత్తర అండమాన్ మీదుగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతుందని.. దాని ప్రభావంతో రాగల 24గంటల్లో తూర్పు మధ్య బంగాళాఖాతాన్ని ఆనుకొని ఉన్న ఉత్తర అండమాన్ ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని తెలిపింది. ఈ నెల 22 నాటికి పశ్చిమ-వాయువ్య దిశగా కదులుతూ బలపడి వాయుగుండంగా మారుతుందని పేర్కొంది. 23వ తేదీ నాటికి పశ్చిమ మధ్య బంగాళాఖాతంపై తుఫానుగా మారుతుందని పేర్కొంది. ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీరానికి చేరుకునే అవకాశం ఉందని పేర్కొంది.పశ్చిమ మధ్య బంగాళాఖాతం ఉత్తర

-మిగతా 3 లో



## జీవో 29 ఉపసంహరించుకోవాలి..

### సీఎం రేవంత్‌కు కేంద్రమంత్రి సంజయ్ లేఖ

హైదరాబాద్

పంథాలు, పట్టింపులకు పోకుండా జీవో 29ని ఉపసంహరించుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డికి కేంద్రమంత్రి బండి సంజయ్ సూచించారు. గ్రూప్-1 అభ్యర్థుల ఆందోళనపై ఆయన సీఎం రేవంత్‌కు లేఖ కేంద్రమంత్రి బండి సంజయ్ లేఖ రాశారు. పరీక్షలని తెలిసి విద్యార్థులు ఆందోళన కొనసాగిస్తున్నారంటూ అర్థం చేసుకోవాలన్నారు.

-మిగతా 3 లో

## జీవో నెం.29తో విద్యార్థులకు నష్టం లేదు

**– పీసీసీ చీఫ్ మహేష్ కుమార్**




హైదరాబాద్

తెలంగాణలో ఇప్పుడు గ్రూపు-1 మెయిన్స్ పరీక్షలు హాట్ టాపిక్ గా మారిన విషయం తెలిసిందే. గ్రూపు-1 పరీక్షలు జరుగుతాయా..? లేదా అని అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. కొంత మంది అభ్యర్థులు రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే తాజాగా పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ స్పందించారు. గాంధీ భవన్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. నిరుద్యోగులు ముఖ్యంగా విపక్షాల ట్రాప్ లో పడొద్దని సూచించారు. జీవో నెం.29 పై విపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని.. ఈ జీవోతో రిజర్వేషన్ కేటగిరి అభ్యర్థులకు ఎలాంటి నష్టం జరగదని స్పష్టం చేశారు. ఎందరో నిపుణులతో చర్చించిన తరువాతనే జీవో నెం.29ని తీసుకొచ్చామని తెలిపారు. జీవో నెం.29తో విద్యార్థులకు నష్టం లేదని తెలుసుకున్నాకే ఇక్కడికి వచ్చి మాట్లాడుతున్నానని పేర్కొన్నారు. గ్రూపు-1 విషయంలో విపక్షాలది అనవసర రాద్ధాంతం అని.. అభ్యర్థులను తప్పుదోవ పట్టించి రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసారు. బీజేపీ-బీఆర్ఎస్ కుమ్మక్కై అభ్యర్థులను రెచ్చగొడుతున్నారని సీరియస్ అయ్యారు మహేష్ కుమార్ గౌడ్.

## ఈవీఎంలను హ్యాక్ చేయొచ్చు

**-ఎన్నికల్లో బ్యాలెట్ పేపర్ బెటర్**
**-టెస్లా అధినేత ఎలాన్ మస్క్**



వాషింగ్టన్,

అమెరికా అధ్యక్ష ఎన్నికల వేళ టెస్లా అధినేత, ఎలాన్ మస్క్ 'ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ల'(ఈవీఎం)పై మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. ఈవీఎంలు ఎన్నికలను 'రిగ్గింగ్' (ఫలితాన్ని ప్రభావితం) చేస్తున్నాయని, కృత్రిమ మేధ పరిజ్ఞానంతో ఈవీఎంలను హ్యాక్ చేయవచ్చునని అన్నారు. బ్యాలెట్ పేపర్‌తో నిర్వహించటాన్ని, చేత్తో ఓట్ల లెక్కింపు ఎన్నికలను ఎలాన్ మస్క్ సమర్థించారు. పెన్సిల్వేనియాలో ఓ ప్రచార సభలో మస్క్ ప్రసంగిస్తూ, 'నేను ఓ టెక్నాలజిస్ట్‌ను. కంప్యూటర్ ప్రోగ్రామింగ్‌ను చాలా సులభంగా హ్యాక్ చేయవచ్చు' అని అన్నారు. ఎన్నికల్లో 'డొమినియన్' కంపెనీ ఈవీఎంల వాడకాన్ని మస్క్ వ్యతిరేకించారు. దేశమంతా బ్యాలెట్ పేపర్‌తో ఎన్నికల్ని నిర్వహించాలని అన్నారు.

## బాలుడి కిడ్నాప్ ఛేదన

**-తల్లిదండ్రుల చెంతకు చేర్చిన పోలీసులు**
**-బిక్షాటన కోసం కిడ్నాప్ చేసినట్టు సమాచారం**

కంఠేశ్వర్



నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి నుంచి కిడ్నాపైన బాలుడు కేసును పోలీసులు ఛేదించారు. వివరాల్లోకి వెళ్తే.. ఆస్పత్రి నుంచి 18వ తేదీ అర్ధరాత్రి పన్నెండు గంటల తర్వాత మద్నూర్ మండలానికి చెందిన పిట్ల రాజు, లక్ష్మి కుమారుడు మణికంఠను ముగ్గురు మహిళలు కిడ్నాప్ చేసినట్టు సీసీ ఫుటేజీలో రికార్డయింది. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాకు చెందిన అంజుమ్ బేగం, ఆమె పదేండ్ల కూతురు, దుర్గ ప్రభు రావుభ మోహితే.. హస్పిటల్‌కి వెళ్లి నిద్రలో ఉన్న లక్ష్మి కొడుకుని తీసుకుని పరారయ్యారు అనంతరం బస్టాండ్ దగ్గర ఆటో మాట్లాడుకొని ఎవరికి అనుమానం రాకుండా సిటీలో తిరుగుతూ రైల్వేస్టేషన్ చేరుకున్నారు. అక్కడ ట్రైన్ రాకపోయే సరికి ఎక్కువ సేపు ఉంటే ఎవరికైనా అనుమానం వస్తుందని అక్కడ నుంచి మళ్లీ నిజామాబాద్‌లో తిరుగుతూ, బోధన్ రోడ్డులోని నిర్మానుష ప్రాంతంలో ఉండి, నాందేడ్‌కి వెళ్లేందుకు అవకాశం కోసం చూస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం పోలీసులకు నమ్మదగిన సమాచారంతో ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి అదుపులో ఉన్న బాలున్ని తల్లిదండ్రులకు అప్పగించారు. బాలుని చేత బిక్షాటన చేపించటం కోసం కిడ్నాప్ చేసినట్టు నిందితులు తెలిపినట్టు సీఐ రఘుపతి తెలిపారు. కేసును 36 గంటల్లో ఛేదించిన ఏఎస్ఐ షకీల్, కానిస్టేబుల్ గంగారాం, డబ్ల్యూపీసీ అనుష, కానిస్టేబుల్ కేర్భాజి, రాములును అభినందించారు.

# సీల్డ్ కవర్‌లో 317 జీవో నివేదిక

**-సీఎం రేవంత్‌రెడ్డికి మంత్రి దామోదర రాజనర్సింహ అందజేత**

హైదరాబాద్



రాష్ట్రంలో 317 జీవోపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం తుది నివేదికను రూపొందించింది. ఆదివారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మంత్రి దామోదర రాజనర్సింహ కలిసి సీల్డ్ కవర్‌లో ఆ నివేదికను అందజేశారు. దామోదర రాజనర్సింహ నేతృత్వంలో మంత్రులు డి శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌తో కలిసి మంత్రివర్గ ఉపసంఘాన్ని ప్రభుత్వం నియమించిన సంగతి తెలిసిందే. ఈ ఉపసంఘం ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతోపాటు నిష్ణాతులైన మేధావులతో ఈ జీవోపై సుదీర్ఘంగా చర్చించింది. ఉద్యోగులు, ఉపాధ్యాయుల అభిప్రాయాలను వినతుల రూపంలో, వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులను స్వీకరించింది. వారి సమస్యల పరిష్కారం కోసం మంత్రివర్గ ఉపసంఘం వివిధ శాఖల ఉన్నతా ధికారులతో పలు దఫాలుగా సమీక్షించింది. అనంతరం తుది నివేదికను రూపొందించి సీఎంకు అందజేసింది. అయితే 317 జీవో వల్ల ఉద్యోగులు, ఉపాధ్యాయులు స్థానికత ఉన్న జిల్లా, జోనల్, మల్టీజోనల్ కాకుండా వేరే జిల్లా, జోనల్, మల్టీ జోనల్‌కు కేటాయించబడ్డారు. సీనియార్టీ ఆధారం గానే గత ప్రభుత్వం ఆ జీవోను అమలు చేసింది. అయితే స్థానికత కోల్పోయిన ఉద్యోగులు, ఉపాధ్యా యులు నాటి నుంచి ఉద్యమిస్తూనే ఉన్నారు. 317 జీవో బాధితుల సమస్యను పరిష్కరిస్తామంటూ కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చింది. అందుకను గుణంగా మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమిం చింది. స్థానికత ప్రకారం ఉద్యోగుల కేటాయింపుపై సుదీర్ఘంగా చర్చించింది. న్యాయవి వాదాలు తలెత్తకుండా 317 జీవో అమలుపై కసరత్తు చేసింది. న్యాయ నిపుణులతో సైతం సంప్రదిం పులు జరిపింది. 317 జీవోలో భాగంగా స్పౌజ్, మ్యూచువల్, మెడికల్ గ్రౌండ్‌లలో ఉద్యోగుల కేటాయింపుపై మంత్రివర్గ ఉపసంఘం సాను కూలత వ్యక్తం చేసినట్టు సమాచారం. త్వరలో ఉద్యోగుల కేటాయింపుపై ఉత్తర్వులను విడుదల చేసే అవకాశమున్నది.

# ఏఐ అంటే రేవంత్ రెడ్డి ఎనుముల ఇంటెలిజెన్స్

హైదరాబాద్



ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) అంటే రేవంత్ రెడ్డి ఎనుముల ఇంటెలిజెన్స్ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా విమర్శించారు. రాష్ట్రంలో 40 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేసినట్టు జాతీయ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియాలో చేసిన పోస్టుపై అభ్యంతరం వ్యక్తం చేశారు. రుణమాఫీ చేసినట్టు ఇచ్చిన ప్రకటనలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రూపొందించిన చిత్రాన్ని వాడారనీ, రైతుల లెక్క విషయం లోనూ సీఎం అదే టెక్నిక్ వాడారని ఆరోపించారు. నిజానికి తెలంగాణలో ఇప్పటి వరకు రైతు రుణాలు 40 శాతం కూడా మాఫీ కాలేదని చెప్పారు. కానీ తరుచూ నిబంధనలతోపాటు రుణమాఫీ తేదీలను మారుస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి తన సొంత గ్రామం, నియోజకవర్గంలోనూ రైతులకు ఇచ్చిన హామీని నెరవేర్చడంలో విఫలమయ్యారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రుణమాఫీ నిబంధనలు, తేదీలు మారుతున్నాయనీ. అబద్ధాలు, బూటకపు ప్రచారాలు మాత్రం నిత్యం ఎలాంటి మార్పు లేకుండా కొనసాగుతు న్నాయని విమర్శించారు.

మలేషియా తెలంగాణ ఉత్సవాలకు కేటీఆర్‌కు ఆహ్వానం మలేషియా తెలంగాణ అసోసియేషన్ దశాబ్ది ఉత్సవాలకు హాజరుకావాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఆ సంస్థ ఆహ్వానించింది. వచ్చే నెల నవంబర్ 9నుంచి కౌలాలంపూర్‌లో పెద్ద ఎత్తున వేడుకలను నిర్వహిస్తున్నామని తెలిపింది. మలేషియా తెలంగాణ అసోసియేషన్ అధ్యక్షులు తిరుపతి, మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం ఆదివారం హైదరాబాద్‌లోని నందినగర్ నివాసంలో కేటీఆర్‌ను కలిసి ఆహ్వానం అందించింది. ఈ సందర్భంగా మలేషియా లోనూ తెలంగాణ వాసులు తమకంటూ ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేసుకుని వివిధ కార్యక్రమాలతో పుట్టిన గడ్డతో మమేకం కావడం పట్ల కేటీఆర్ వారిని అభినందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు కార్తీక్ రెడ్డి, రాకేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఇజ్రాయిల్ దాడులపై అమెరికాకు ఇరాన్ హెచ్చరిక



ఇజ్రాయిల్ దాడులపై అమెరికాకు ఇరాన్ హెచ్చరికఇస్లామిక్ రిపబ్లిక్‌పై భారీ దాడులు చేస్తామని ఇజ్రాయిల్ బెదిరింపులకు పాల్పడితే అమెరికాను భాగస్వామిగా చూస్తామని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ హెచ్చరించాడు. అక్టోబరు 1 న ఇరాన్ క్షిపణి బారేజీకి ప్రతీకారంగా వాషింగ్టన్ సన్నిహిత మిడిల్ ఈస్ట్ మిత్రుడు ఏమి చేయగలడు?, ఇజ్రాయిల్ 'వాస్తవానికి ఇరాన్‌కు ప్రతిస్పందిస్తుందా' అనే దానిపై 'మంచి అవగాహన' ఉందా అని శుక్రవారంనాడు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌ను జర్నలిస్టులు అడిగినప్పుడు ఆయన 'అవును' అని బదులిచ్చాడు. కానీ మరిన్ని వివరాలను అందించడానికి నిరాకరించాడు. 'ఇజ్రాయిల్ ఇరాన్‌పై ఎలా, ఎప్పుడు దాడి చేస్తుంది?' అటువంటి మూర?త్వానికి మద్దతును అందించడం గురించి జ్ఞానం లేదా అవగాహన ఉన్న ఎవరైనా, ఏదైనా సాధ్యమయ్యే కారణానికి తార్కికంగా జవాబుదారీగా ఉండాలని అరాఘ్చి శనివారం ఎక్స్ కి నొక్కి చెప్పాడు'. ఇరాన్ విదేశాంగ మంత్రి తన సందేశంలో నేరుగా వాషింగ్టన్ పేరును ప్రస్తావించలేదు. కానీ అతని పోస్ట్‌లో ఇరాన్‌ను లక్ష్యంగా చేసుకునే ఇజ్రాయిల్ ప్రణాళికల గురించి తనకు తెలుసునని రాయిటర్స్ కథనాన్ని బైడెన్ ధ్రువీకరించాడు. ఇరాన్‌పై సాధ్యమయ్యే దాడులకు ఇజ్రాయిల్ సన్నాహాలపై అత్యంత రహస్య గూఢచార నివేదికలు ఆన్‌లైన్‌లో లీక్ అయిన తర్వాత అమెరికా దర్యాప్తు ప్రారంభించిందని మూడు సమాచార వనరులను ఉటంకిస్తూ సీఎన్ఎన్ శనివారంనాడు రిపోర్ట్ చేసింది. శుక్రవారంనాడు టెలిగ్రామ్‌లో పోస్ట్ చేయబడిన రెండు పత్రాల్లో ఒకటి స్పష్టంగా పెంటగాన్ నేషనల్ జియోస్పేషియల్-ఇంటెలిజెన్స్ ఏజెన్సీచే తయారు చేయబడింది. ఇజ్రాయిల్ మిలిటరీ 'అక్టోబర్ 16న ఇరాన్‌పై దాడి కోసం దాదాపు కచ్చితంగా కీలకమైన సాయుధ సన్నాహాలు, రహస్య యూఏవీ కార్యకలాపాలను కొనసాగించింది' అని చెప్పింది. రెండవ ఫైల్‌లో అక్టోబర్ 15, 16 తేదీల్లో ఇజ్రాయిలీ వైమానిక దళం నిర్వహించిన భారీ విన్యాసం గురించి వివరణ ఉంది. గత నెల్లో హమాస్, హిజ్‌బుల్లా నాయకులు, ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ జనరల్ హత్యలకు ప్రతిస్పందనగా అక్టోబరు 1న ఇరాన్ ఇజ్రాయిల్‌పై దాదాపు 200 బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. అప్పటి నుంచి, ఇజ్రాయిల్ రక్షణ మంత్రి యోవ్ గల్లంట్ 'ప్రాణాంతకమైన, ఖచ్చితమైన, ఆశ్చర్యకరమైన' ప్రతీకారాన్ని అందిస్తానని బెదిరించాడు. అయితే కొంతమంది ఇజ్రాయిల్ అధికారులు అణు సౌకర్యాలతో సహా ఇరాన్ ఇంధన మౌలిక సదుపాయాలపై దాడులకు పిలుపునిచ్చారు. ఇజ్రాయిల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు కార్యాలయం గురువారం మాట్లాడుతూ, 'మన జాతీయ ప్రయోజనాల ఆధారంగా' ప్రతీకార చర్యకు సంబంధించి దేశం 'చివరి నిర్ణయాలు' తీసుకుంటుందని అన్నాడు.

# యుద్ధానికి సిద్ధం కండి

**సైన్యానికి చైనా అధ్యక్షుడు ఆదేశాలు**



బీజింగ్,

ఉక్రెయిన్-రష్యా యుద్ధం, ఇజ్రాయెల్-హమాస్ యుద్ధంతో ప్రపంచం వణికిపోతుంటే, కొత్తగా చైనా కూడా యుద్ధ భేరీ మోగించేందుకు సిద్ధమవుతున్నది. తైవాన్ చుట్టూ పెద్ద ఎత్తున సైనిక విన్యాసాలు చేపడుతూ, ఆ దేశాన్ని భయభ్రాంతులకు గురిచేస్తున్నది. దీంతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తత పతాక స్థాయికి చేరుకుంది. యుద్ధానికి సిద్ధంగా ఉండాలంటూ తమ దేశ సైనికులకు చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ తాజాగా పిలుపునిచ్చారు. పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ రాకెట్ ఫోర్స్‌కు చెందిన బ్రిగేడ్‌ను జీ జిన్‌పింగ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'సమగ్రమైన శిక్షణ, సన్నద్ధతతో సైనిక బలగాలు యుద్ధానికి సిద్ధంగా ఉండాలి. తమ పోరాట సామర్థ్యాల్ని పెంచుకోవాలి' అని అన్నారు. ఈ విషయాన్ని చైనా ప్రభుత్వ ఆధ్వర్యంలోని సీసీటీవీ తాజాగా పేర్కొన్నది. తైవాన్ స్వతంత్ర, సార్వభౌమత్వాన్ని సవాల్ చేస్తున్న చైనా, ఆ దేశం చుట్టూ పెద్ద ఎత్తున మిలటరీ డ్రిల్స్‌ను నిర్వహించటం సంచలనంగా మారింది. తైవాన్‌కు అత్యంత సమీపంలో యుద్ధ విమానాలు, డ్రోన్లు, యుద్ధ నౌకలు, కోస్ట్‌గార్డ్ నౌకలతో చైనా సైనిక విన్యాసాలు మరింత ఉధృతమయ్యాయి. తైవాన్‌ను తమ ఆధీనంలోకి తీసుకునేందుకు యుద్ధం చేయడానికి వెనుకాడబోమని బీజింగ్ నాయకత్వం ఇప్పటికే ప్రకటించింది.

# నేటినుంచే గ్రూప్-1 మెయిన్స్

(మొదటి తరువాయి)

29 జీవోను రద్దు చేయాలని అభ్యర్థులు శనివారం పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టారు. ఈ సమయంలో గ్రూప్-1 పరీక్షలు షెడ్యూల్ ప్రకారం జరుగుతాయా? లేదా? అన్నది చర్చనీయాంశంగా మారింది. మంత్రి పొన్నం ప్రభాకర్ నివాసంలో మంత్రులు దామోదర రాజనర్సింహ, శ్రీధర్‌బాబు, కొండా సురేఖ, టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్, అధికారులు, న్యాయ నిపుణులతో అర్ధరాత్రి వరకు చర్చలు జరిగాయి. ఆదివారం ప్రభుత్వం కీలకమైన ప్రకటన చేస్తుందంటూ ప్రచారం జరిగింది. కానీ ఆదివారం రాత్రి వరకు ఎలాంటి ప్రకటన వెలువడ లేదు. ఇంకోవైపు గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు వాయిదా వేస్తున్నట్టుగానీ, 29 జీవోను రద్దు చేస్తున్నట్టు లేదంటే సవరిస్తామంటూ ఎలాంటి ప్రకటనను అటు ప్రభుత్వం, ఇటు టీజీపీఎస్సీ ఇవ్వలేదు. అనేక ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నా, అభ్యర్థులు ఆందోళన చేస్తున్నా గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలను నిర్వహించడానికే ప్రభుత్వం మొగ్గు చూపింది. దీంతో ఉత్కంఠకు తెరపడింది. సోమవారం నుంచి గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు జరుగుతాయి. రాష్ట్రంలో 2011 తర్వాత గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు ఇప్పుడే జరుగుతున్నాయి. దీంతో అత్యంత పకడ్బందీగా నిర్వహించేందుకు తెలంగాణ పబ్లిక్



సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ఏర్పాట్లు చేసింది. ఏ విధమైన పొరపాట్లకు తావు లేకుండా, అభ్యర్థులకు ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నది. ఇంకోవైపు అభ్యర్థుల ఆందోళనల నడుమ పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు పటిష్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పరీక్షలు సజావుగా జరిగేలా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. నిఘా నీడలో ఈ పరీక్షలు జరగబోతున్నాయి. హైదరాబాద్‌లో ఎనిమిది, రంగారెడ్డిలో 11, మేడ్చల్ మల్కాజిగిరిలో 27 కలిపి మొత్తం 46 పరీక్షా కేంద్రాల్లో గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలను నిర్వహిస్తున్నారు. 563 గ్రూప్-1 పోస్టుల భర్తీకి ఈ ఏడాది ఫిబ్రవరి 19న గ్రూప్-1 నోటిఫికేషన్‌ను టీజీపీఎస్సీ జారీ చేసిన విషయం తెలిసిందే. గ్రూప్-1 ప్రిలిమినరీ రాతపరీక్షను జూన్ తొమ్మిదిన నిర్వహించింది. ఈ పరీక్షకు 4.03 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేయగా, 3.02 లక్షల మంది హాజరయ్యారు. వారిలో 31,383 మంది అభ్యర్థులు గ్రూప్-1 మెయిన్స్‌కు ఎంపికయ్యారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద చీఫ్ సూపరింటెండెంట్ రూమ్, పరిసర ప్రాంతాలన్నింటిలోనూ సీసీ టీవీలను ఏర్పాటు చేసి అధికారులు పర్యవేక్షిస్తున్నారు. టీజీపీఎస్సీ కార్యాలయంలో పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించేందుకు కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల బయోమెట్రిక్ హాజరు తీసుకునేందుకు ప్రత్యేక సిబ్బందిని నియమించారు. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరుగుతాయి. మధ్యాహ్నం 12.30 గంటల నుంచి పరీక్షా కేంద్రాల్లోకి అభ్యర్థులకు అనుమతి ఉంటుంది. మధ్యాహ్నం ఒకటిన్నర తర్వాత పరీక్షా కేంద్రాల్లోకి అభ్యర్థులకు అనుమతి ఉండబోదని అధికారులు స్పష్టం చేశారు. సకాలంలో చేరుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రాలకు ప్రత్యేక బస్సులను నడపనున్నట్టు ఆర్టీసీ అధికారులు తెలిపారు.

# దేశానికే రోల్‌మోడల్‌గా హైదరాబాద్

(మొదటి తరువాయి)

పనిచేయాలని కోరారు. ప్రభుత్వం వారికి కార్పొరేట్ కంపెనీల తరహాలో మంచి జీతాలు ఇవ్వలేకపోయినా, జీవితానికి సరిపడా సవాళ్లు, లక్ష్యసాధన అనుభవాలను అందిస్తామ న్నారు. ఒలింపిక్స్‌లో స్వర్ణపతకాలు గెలవడమే లక్ష్యంగా తాము క్రీడాకారుల్ని తీర్చిదిద్దాలని భావిస్తున్నా మన్నారు. రాష్ట్రంలోని అనేక రంగాల్లో అద్భుతమైన వ్యాపార అవకాశాలు ఉన్నాయనీ, వాటిని అంది పుచ్చుకొనేందుకు ఐఎస్‌బీ విద్యార్థులు కృషి చేయాలని కోరారు. జీవితంలో సవాళ్లు, త్యాగాలు లేకుండా గొప్ప విజయాలు సాధించే నాయకులుగా ఎదగలేమని చెప్పారు. మంచి నాయకుడికి ధైర్యం, త్యాగం, సమయస్ఫూర్తి ఉండాలని అన్నారు. మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, మన్మోహన్ సింగ్, పీవీ నరసింహారావు వంటి మహానేతల జీవితాలను అధ్యయనం చేస్తే వారు డబ్బు, సమయం, వ్యక్తిగత జీవితం సహా అనేక త్యాగాలు చేశారనీ, అదే సమయంలో వారిలోని ధైర్యం, తెగువ కూడా మనకు కనిపిస్తాయని ఉదహరించారు.



సమస్యలపై ప్రజలతో మమేకమయ్యేందుకు నాయకుడు ఎప్పుడూ సిగ్గుపడకూడదనీ, నిత్యం వారితో సంబంధాలు పెట్టుకోవాలనీ, పేదలు, ధనికులు ,చిన్నా, పెద్దా అన్న భేదం లేకుండా సమాన గౌరవం ఇస్తూ స్నేహ భావంతో అందరిని కలుపుకుపోవాలని దిశానిర్దేశం చేశారు. ఐఎస్‌బీ విద్యార్థులు హైదరాబాద్, తెలంగాణతో పాటు న్యూ ఇండియాకు బ్రాండ్ అంబాసిడర్లుగా నిలవాలని కోరారు. తెలంగాణను లక్ష కోట్ల డాలర్ల జీడీపీ ఆర్థిక వ్యవస్థగా మార్చాలనీ, దానికోసం హైదరాబాద్‌ను 60 వేల కోట్ల డాలర్ల నగరంగా మార్చాలనేదే తమ లక్ష్యమని వివరించారు. ఐఎస్‌బీ విద్యార్థులు ప్రపంచంలో ఎక్కడికి వెళ్ళినా పెట్టుబడిదారులు, వ్యాపారవేత్తలు, సామాన్య ప్రజలతో తెలంగాణ, హైదరాబాద్ గురించి మాట్లాడాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామనీ, గచ్చిబౌలిలో స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సౌత్ కొరియా వంటి చిన్న దేశం ఒలింపిక్స్‌లో అనేక పతకాలు సాధించిందనీ, ఇంత పెద్ద భారతదేశం ఒక్క బంగారు పతకం కూడా సాధించలేకపోయిందని అన్నారు. అందుకే తెలంగాణ నుంచే దేశానికి ఈసారి ఒలింపిక్స్ లో బంగారు పతకం సాధించాలనే కసి, పట్టుదలతో పనిచేస్తున్నామని చెప్పారు.

# బోనస్ లేదు.. రైతు భరోసా రాదు

(మొదటి తరువాయి)

బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. దేవుళ్ల మీద ఒట్లు వేసి ప్రజలకు ఇచ్చిన మాట తప్పిన ఏకైక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని, పథకాల కాలం పోయి ఫొటోలకు ఫోజులిచ్చే కాలం వచ్చిందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల మాత్రం చావుకబురు చల్లగా చెప్పినట్టు నాట్లు వేసి, కోతలు కోసిన రైతు ఖరీఫ్‌కు పైసలు లేవని చెప్పడం హాస్యస్పదమన్నారు. బోనస్ లేదు.. రైతు భరోసా రాదు.. ఇదేనా కాంగ్రెస్ పాలనని ఎద్దేవా చేశారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం, కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని కొత్తపల్లి గ్రామంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఆదివారం అలరు బలరు పేరుతో దసరా సమ్మేళనాలు నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన దసరా సమ్మేళనంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డితో కలిసి కేటీఆర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఈ 11 నెలల్లో ఒక్క మంచి పనైనా చేసిందా అని ప్రశ్నించారు. ఫార్మాసిటీ స్థానంలో ఫ్యూచర్ సిటీ ఏర్పాటు చేస్తామని చెబుతున్న సీఎం రేవంత్‌రెడ్డి.. ఆయన నలుగురు సోదరుల రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసమే ఫ్యూచర్ సిటీ నాటకం ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రీన్ ఫార్మా ఏర్పాటుకు తాము 14వేల ఎకరాల భూమి సేకరించగా.. నేటి ముఖ్యమంత్రి ఫార్మాసిటీ రద్దు చేస్తామని చెప్పి రైతులను మోసం చేశాడని అ న్నారు. త్వరలోనే తమ ఎమ్మెల్యేలతో కలిసి 9 గ్రామాల్లో పర్యటించి, ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలకు వివరిస్తామని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక బతుకమ్మ పండుగకు చీరలు లేవని, దసరా పండుగ కళ తప్పిందని, గణేష్ పండుగ పండుగలా లేదని అన్నారు. చిట్టినాయుడికి ఢిల్లీ చుట్టూ చక్కర్లు



కొట్టడానికే సరిపోయిందని తెలిపారు. ఎన్నికలకు ముందు నిరుద్యోగులకు 2 లక్షల ఉద్యోగాలి స్తామని హామీ ఇచ్చిన రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డి.. వారికి మాత్రమే ఉద్యోగాలు తెచ్చుకు న్నారని, జీవో 29 తెచ్చి నిరుద్యోగులను మోసం చేశారని విమర్శించారు. గతంలో చంద్రబాబు, రాజశేఖర్‌రెడ్డితోనే కొట్లాడి తెలంగాణ సాధించు కున్నామని.. ఈ చిట్టినాయుడు ఎంత అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం చేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు క్యామ మల్లేష్, మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్‌రెడ్డి, గ్రంథా లయ కమిటీ మాజీ చైర్మన్ సత్తు వెంకట రమణా రెడ్డి, నాయకులు వంగేటి లక్ష్మారెడ్డి, కటేష్, చంద్రయ్య, అంజిరెడ్డి, కిషన్‌గౌడ్, రమేష్‌గౌడ్, మందా సురేష్, ఆకుల యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

**దేవుళ్ల మీద ఒట్లు వేసి మాట తప్పిన రేవంత్‌రెడ్డి : మాజీ మంత్రి హరీశ్‌రావు**

కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని కొత్తపల్లి గ్రామంలో బీఆర్‌ఎస్ మానకొండూర్ నియోజకవర్గ కుటుంబ ఆత్మీయ సమ్మేళనం అలరు బలరు కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావుతో కలిసి హరీశ్‌రావు హాజరై మాట్లాడారు. ఈ సమావేశం చూస్తే 2001 నాటి రోజులు గుర్తుకు వస్తున్నాయని అన్నారు. రసమయి బాలకిషన్ ఉద్యమ సయమంలో ధూంధాం పేరిట ఎంతో జాగతం చేసిందని గుర్తుచేశారు. అలాగే మరోసారి రైతులతో పాటు అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ మీద పోరాటానికి మరో ధూంధాం మొదలుపెట్టే రోజులు వచ్చాయని అన్నారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను తీసుకువచ్చి రేవంత్‌రెడ్డి హామీలు ఇప్పించిండని, కాంగ్రెస్ హనీమూన్ పీరియడ్ అయిపోయిందని, ఇక పోరాటం చేయాల్సిన సమయం వచ్చిందని చెప్పారు. గ్రూపు-1 యువతపై అరాచకంగా బందిపోట్లు, దొంగలను కొట్టినట్టు ఇష్టం ఉన్నట్టు కొడుతున్నారని.. ఓట్లప్పుడు రాహుల్ గాంధీ లైబ్రరీ పోయి విద్యార్థులను బతిమిలాడారని, ఇప్పుడు ఎక్కడికి పోయారని ప్రశ్నించారు. ప్రభుత్వ పథకాల అమలుకు, పేదలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలంటే పైసలు లేవంటాడని, మరి మూసీకి రూ.1.50లక్షల కోట్లు ఎక్కడినుంచి వచ్చాయని అన్నారు. ప్రజల తరుపున పోరాటం చేస్తామంటే వ్యక్తిగతంగా విమర్శలు చేస్తున్నారని, తనమీద, కేటీఆర్ మీద బుల్డోజర్లు ఎక్కిస్తా అంటున్నాడని ఆరోపించారు. పేదలకు అన్యాయం జరిగితే చావడానికైనా సిద్ధమని చెప్పారు. ప్రభుత్వ తప్పులను ఎత్తి చూపడమే ప్రతిపక్షం బాధ్యతని, ఆ పనే కేసీఆర్, బీఆర్‌ఎస్ చేస్తున్నదని తెలిపారు. కార్యక్రమంలో మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్, జిల్లా అధ్యక్షులు జీవీ రామకృష్ణారావు, నాయకులు పాల్గొన్నారు.

# జీవో 29 ఉపసహరించుకోవాలి..

(మొదటి తరువాయి)

నిరుద్యోగులంతా మీ కుటుంబ సభ్యులుగా భావించి వారి ఆవేదనను అర్థం చేసుకోవాలన్నారు. గ్రూప్-1 పరీక్షలను రీషెడ్యూల్ చేయాలన్నారు. జీవో 29 కారణంగా గ్రూప్-1 పరీక్షల్లో 5,003 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు అనర్హులయ్యారన్నారు. 563 పోస్టులకు గుండుగుత్తగా 1:50 చొప్పున అభ్యర్థులను ప్రకటించడం అన్యాయమన్నారు. ఈ మొత్తం పోస్టుల్లో 354 రిజర్వ్ పోస్టులని.. 29 జీవోతో ఓపెన్ కేటగిరిలో అర్హత సాధించిన రిజర్వ్ అభ్యర్థులను సైతం రిజర్వ్ కేటగిరీలో చేర్చడం అన్యాయమన్నారు. ఈ జీవోతో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల అభ్యర్థులు 1:50 చొప్పున అర్హత సాధిస్తే.. ఓసీ వర్గాలు 1:65 శాతం మేరకు అర్హత సాధించారన్నారు. జీవో నెంబర్ 29 రాజ్యాంగ స్ఫూర్తికి రూల్ ఆఫ్ రిజర్వేషన్‌కు వ్యతిరేకమన్నారు. గ్రూప్-1 అభ్యర్థులు తీవ్రమైన ఆందోళనలో ఉన్నారని.. గ్రూప్-1 పరీక్షలను రీషెడ్యూల్ చేయకుంటే ఆత్మహత్యే శరణ్యమని వాపోతున్నారన్నారు. 29 జీవోతో రాష్ట్రంలో మొత్తం రిజర్వేషన్ల వ్యవస్థనే రద్దు చేయబోతున్నారనే చర్చ మొదలైందని.. తక్షణమే 29 జీవోను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

# పొంచి ఉన్న తుఫాను ముప్పు..

(మొదటి తరువాయి)

తమిళనాడు తీరప్రాంతంలో ఉపరితల ఆవర్తనం సగటు సముద్రమట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తులో కొనసాగుతుందని.. ఎత్తుకు వెళ్లే కొలది నైరుతి దిశగా వంగి ఉందని వివరించింది. ఈ క్రమంలో రాష్ట్రంలో ఆదివారం ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, రాజన్న సిరిసిల్ల, కొత్తగూడెం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వర్షాలుపడేందుకు అవకాశం ఉందని వివరించింది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. అలాగే, ఈ నెల 25 వరకు పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం చెప్పింది.

# అనుమతులున్న నిర్మాణాలను హైడ్రా కూల్చేయదు

(మొదటి తరువాయి)

అనుమతులతో నిర్మాణాలు చేపట్టిన వారెవరూ భయపడాల్సిన అవసరం లేదని భరోసానిచ్చారు. చెరువుల వద్ద అనుమతులున్న నిర్మాణాలను సైతం కూల్చివేస్తామంటూ ప్రచారం జరుగుతోందనీ, ఇందులో ఏ మాత్రం వాస్తవం లేదని కొట్టి పారేశారు. అనుమతులున్న నిర్మాణాలను కూల్చేయమని సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే స్పష్టం చేశారని గుర్తు చేశారు. సీఎం ఆదేశాలకు హైడ్రా కట్టుబడి ఉంటుందని స్పష్టతనిచ్చారు.

# ఉత్తర గాజాలో బాంబుల వర్షం

(మొదటి తరువాయి)

దాడిలో హిజ్బుల్లా సదరన్ కమాండ్‌లోని టాప్ కమాండర్ అల్హాజ్ అబ్బాస్ సలేం, కమ్యూనికేషన్స్ స్పెషలిస్ట్ రడ్జా అబ్బాస్ అవ్చే, హిజ్బుల్లా వ్యూహాత్మక ఆయుధాల అభివద్ధిని పర్యవేక్షిస్తున్న అహ్మద్ అలీ హుస్సేన్ చనిపోయినట్లు రాయిటర్స్ వార్తా సంస్థ తెలిపింది. ఇరాన్-మద్దతుగల బందం తన నివాసాన్ని లక్ష్యంగా చేసుకుని తనను హత్య చేసేందుకు ప్రయత్నించిందని ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు ఆరోపించిన కొద్ది సేపటికే



హిజ్బుల్లా దక్షిణ బీరుట్ కోటపై భీకర దాడులు జరిగాయి. అదే సమయంలో ఉత్తర గాజాలో బీట్ లాహియాపై జరిపిన ఈ దాడుల్లో 73 మంది పాలస్తీనియన్లు చనిపోయారు. . గాజా, లెబనాన్‌లలో మొత్తం 175" లక్ష్యాలపై ఇజ్రాయిల్ వైమానిక దాడులు చేసింది. "నన్ను , నా భార్యను హత్య చేసేందుకు ఇరాన్ అనుబంధ సంస్థ హిజ్బుల్లా చేసిన ప్రయత్నం ఘోర తప్పిదం" అని ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు అన్నారు. ఇజ్రాయెల్ దళాలు బుధవారం గాజాలో పాలస్తీనా ఉద్యమ నాయకుడు యాహ్యా సిన్వార్‌ను హతమార్చిన తర్వాత ఈ ప్రాంతంలో హమాస్, హిజ్బుల్లా, ఇరాన్-మద్దతుగల గ్రూపులు తమ శత్రువుపై పోరాటం కొనసాగు తుందని ప్రకటించాయి. పాలస్తీనాలో హమాస్ అనేది ఎవరూ విస్మరించలేని వాస్తవం, దానిని ఎవరూ నాశనం చేయలేరు" అని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘి అన్నారు. ఇజ్రాయెల్ ఉత్తర గాజాలో రెండు వారాల్లో 450 మందిని పొట్టనబెట్టుకుంది.. దీంతో గాజాలో మొత్తం మరణాల సంఖ్య 42,519కి చేరుకుంది. జబాలియాలోని సహాయక శిబిరంపై జరిగిన దాడిలో 10 మంది మరణించారు. హిజ్బుల్లా టన్నెల్ నెట్‌వర్క్‌పై ఇజ్రాయిల్ గురి కొన్ని కిలోమీటర్ల పొడవైన సొరంగాల నెట్‌వర్క్‌ను ఇజ్రాయిల్ సైన్యం గుర్తించింది. వీటిలో వందలాది మంది హిజ్బుల్లాలు తలదాచుకోవచ్చు.. ఇక్కడ అవసరమైన ఆహార పదార్థాలను నిల్వ చేస్తారు. నీరు, విద్యుత్ సౌకర్యం కల్పిస్తారు. ఆయుధాలను పంపిణీ చేసే సదుపాయం కూడా ఉంది. సొరంగాలను ధ్వంసం చేసేందుకు లేదా వాటిని సిమెంటుతో కప్పేందుకు ప్రయత్నిస్తున్నారని ఇజ్రాయెల్ ఇంటెలిజెన్స్ అధికారి ఒకరు తెలిపారు. 2006లో ఇజ్రాయెల్‌తో జరిగిన యుద్ధంలో హిజ్బుల్లా తొలిసారిగా సొరంగాలను ఉపయోగించింది. తర్వాత ఆ నెట్‌వర్క్‌ను మరింత బలోపేతం చేసింది. ట్రక్కులు క్షిపణులుగా వెళ్లగల భారీ సొరంగాల వీడియోలను హిజ్బుల్లా విడుదల చేసింది.


శాంతి భద్రతల పరిరక్షణ కోసం
విధినిర్వహణలో అసువులు బాసిన
పోలీసు అమరవీరుల త్యాగాలు
మరువలేనివి
పోలీసు అమరవీరుల సంస్మరణ
దినోత్సవం
అక్టోబర్ 21
తెలంగాణ హైకోర్టు న్యాయవాది
తరిగొప్పుల అమరేందర్
COVENOR
LEGAL CELL, HUMAN RIGHTS & RTD
Dep..(TPCC)
తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర
అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి కాంగ్రెస్
నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

# రైతు భరోసా ఇవ్వాలని మోత్కూర్ లో బీఆర్ఎస్ శ్రేణుల రాస్తారోకో

**మోత్కూరు అక్టోబర్ 20 ప్రజా స్వేచ్ఛ**

రైతులకు వానాకాలం సీజన్ రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ యాదాద్రి జిల్లా మోత్కూరు మున్సిపల్ కేంద్రంలో బీఆర్ఎస్ శ్రేణులు రాస్తారోకో చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా మొదటి దఫా పంట పెట్టుబడి సాయం రైతు భరోసా రూ.7500 ఇవ్వకుండా రైతులను మోసగించిందని నాయకులు ఆరోపించారు. కాంగ్రెస్ ఎన్నికల హామీలో పంట పెట్టుబడి సాయం కింద రైతు భరోసా రూ. 15వేలు ఇస్తామని ప్రగల్బాలు పలికిందని, ఇప్పుడు కుంటి సాకులు చెబుతూ రైతు భరోసా ఎగ్గొడుతుందని విమర్శించారు. రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తామని ఎంతో ఆర్భాటంగా ప్రకటించి సగం మంది రైతులకు కూడా రుణమాఫీ చేయలేదని, ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ అమలు చేస్తామని చెప్పి రేషన్ కార్డు లింక్ పెట్టి రైతులకు రుణమాఫీ చేయకుండా ఇబ్బందులు పెడుతుందని తెలిపారు. వానాకాలం పంట ముగిసి రైతులు రెండో పంట వేసేందుకు సిద్ధమవుతున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే రైతు భరోసా రూ.15 వేలు రైతుల




ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చని కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు పొన్నెబోయిన రమేష్, జంగ శ్రీను,మాజీ మార్కెట్ చైర్మన్ కొణతం యాకుబ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గజ్జి మల్లేష్, రైతుబంధు సమితి మాజీ అధ్యక్షుడు కొండా సోంమల్లు, సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు రాంపాక నాగయ్య, మాజీ సర్పంచ్ బయ్యని పిచ్చయ్య, మర్రి అనిల్ కుమార్, అండెం రాజిరెడ్డి, కోక బిక్షం, మంచె గోవర్ధన్, అన్నందాసు విద్యాసాగర్, బోడ శ్రీను, గనగాని రాజేష్,సోషల్ మీడియా కోఆర్డినేటర్ పొన్నె బోయిన మచ్చగిరి, మొరిగాల వెంకన్న, కూరేళ్ల ఇంద్రశేఖర్, కూరేళ్ల రమేష్, చుక్క అశోక్, పసునూరి సత్తిరెడ్డి, కుక్కల ఆంజనేయులు, కల్వాల శోభన్ బాబు, పైళ్ల బుచ్చయ్య, దండ బోయిన వెంకన్న, కన్నబోయిన లింగం, దండ బోయిన శీను, రాంపాక స్వామి, దండ బోయిన సత్తయ్య, బుడిగే శీను, దండ బోయిన నాగరాజు, పులగం నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ సంక్షేమ హాస్టల్ లో నాణ్యతమైన భోజనం ఏర్పాటు చేయాలి

**-ఏఐఎస్ఎఫ్ డిమాండ్**



**నారాయణఖేడ్ అక్టోబర్ 20: ప్రజా స్వేచ్ఛ**

నారాయణఖేడ్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు సిహెచ్ అశోక్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ హాస్టల్లో మెనూ ప్రకారం భోజనాలు పెట్టాలని కొన్ని హాస్టల్లో మెనూ ప్రకారం భోజనాలు పెట్టట్లేదని, టిఫిన్, పండ్లు, గుడ్లు, పాలు, చికెన్ ప్రతీది నాణ్యంగా సరైన పద్ధతిలో ఉండాలని ఆయన అన్నారు. హాస్టల్లో ఉన్న పిల్లలకు ఎటువంటి ఇబ్బంది పెట్టొద్దని వారు అన్నారు. మెనూ ప్రకారం పెట్టకపోతే పై అధికారుల దిష్టికి తీసుకెళ్తామని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాజు, ప్రవీణ్, నిఖిల్, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

## ఓనస్ ఆసుపత్రి డాక్టర్లకు ఉత్తమ అవార్డులు..




**ఎల్బీనగర్ అక్టోబర్ 20 ప్రజా స్వేచ్ఛ**

ఓనస్ ఆసుపత్రి డాక్టర్లకు ఉత్తమ అవార్డులు రావడం చాలా సంతోషంగా ఉందని చంప పేట ప్రధాన రహదారిలోని ఓనస్ రోబోటిక్ మరియు హార్ట్ యూనిట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బాలరాజు నాయుడు అన్నారు. ఐబిజ్ టీవీ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వేల్లో ఓనస్ ఆసుపత్రిలో పనిచేస్తున్న ముగ్గురు డాక్టర్లు రోబోటిక్ ఆర్థోపెటిక్ సర్జన్ డాక్టర్ బాలరాజ్ నాయుడు, సీనియర్ ఇంటర్నేషనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ లక్కిరెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి, సీనియర్ ఫోర్త్ జెన్ ఫిజీషియన్ డాక్టర్ రవి కిరణ్ ఉప్పల లకు అవార్డులను ప్రకటించినట్లు తెలిపారు. సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అవార్డులను అందుకున్నట్లు తెలిపారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవార్డులు ఇవ్వడం వల్ల మాకు మరింత బాధ్యత పెరిగిందని సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. వివిధ జిల్లాల నుండి ఆసుపత్రికి వివిధ రకాల రోగులతో మరియు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వారు వస్తుంటారని వారందరికీ వారికి అందుబాటులో ఉండే విధంగా వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. గతంలో అనేక అవార్డులు వచ్చినట్లు తెలిపారు

## ఘనంగా హెల్ప్ ఫౌండేషన్ మూడవ వార్షికోత్సవ మహోత్సవం





**పల్నాడు అక్టోబర్ 20: ( ప్రజా స్వేచ్ఛ**

స్వచ్ఛంద సేవా సంస్థలు సమాజ సేవలో తమ వంతు పాత్ర పోషించి సమాజంలో పేద వర్గాల అభివృద్ధికి కృషి చేయాలని పల్నాడు జిల్లా అటవీ అధికారి ఎన్ రామచంద్ర రావు అన్నారు. ఆదివారం హెల్ప్ ఫౌండేషన్ సత్తెనపల్లి సేవా సంస్థ మూడవ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం సత్తనపల్లి ఐఎంఏ హాల్లో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. పర్యావరణ సాంఘిక సేవా కార్యక్రమంలో హెల్ప్ ఫౌండేషన్ చేస్తున్న కార్యక్రమాలు అభినందించదగినవి అని అన్నారు. సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు కంచర్ల బుల్లిబాబు ప్రజలకు ముందు ముందు ఎన్నో సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు చేరువవుతారని అభిలాషించారు. ఈ కార్యక్రమానికి మరో ముఖ్య అతిథులుగా పివిసి అంజనీకుమారి సి ఎస్ సి సి హైదరాబాద్ నిర్మలాదేవి డాక్టర్ కేఆర్ రమ్య కేఎల్ యూనివర్సిటీ తదితరులు ఇచ్చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ రంగాల్లో సేవలు అందించిన ప్రముఖులకు జాతీయ సేవా పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్ కు, పి.వెంకట్రావు లకు మదర్ తెరిసా జాతీయ సేవా పురస్కారాలు అందించారు.

# కుమార్తె కోసం ఎన్నికల ప్రచారం చేయనున్న సోనియా గాంధీ

-ఇటీవల ఎన్నికల్లో వయనాడ్, రాయ్ బరేలి నుంచి నెగ్గిన రాహుల్
-వయనాడ్ సీటును వదులుకున్న కాంగ్రెస్ అగ్రనేత
-నవంబరు 13న ఉప ఎన్నిక
-కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో దిగుతున్న ప్రియాంక గాంధీ




**ప్రజా స్వేచ్ఛ**

కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వయనాడ్ లోక్ సభ స్థానం ఉప ఎన్నికలో పోటీ చేస్తుండడం తెలిసిందే. ఇటీవలి ఎన్నికల్లో రాహుల్ గాంధీ వయనాడ్, రాయ్ బరేలి రెండు చోట్ల గెలుపొందారు. దాంతో ఆయన వయనాడ్ సీటును వదులుకోవడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈ స్థానంలో రాహుల్ సోదరి ప్రియాంక గాంధీని బరిలో దింపాలని కాంగ్రెస్ హైకమాండ్ నిర్ణయించింది. వయనాడ్ లో కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రియాంక పేరును ఇటీవలే అధికారికంగా ప్రకటించారు. ఈ నేపథ్యంలో, తన కుమార్తె ప్రియాంక గాంధీ కోసం కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్ పర్సన్ సోనియా గాంధీ స్వయంగా ఎన్నికల ప్రచారానికి తరలిరానున్నారు. ప్రత్యక్ష ఎన్నికల్లో పాల్గొనడం ప్రియాంక గాంధీకి ఇదే తొలిసారి కావడంతో, కాంగ్రెస్ నాయకత్వం వయనాడ్ ఉప ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. వయనాడ్ లో నవంబరు 13న పోలింగ్ జరగనుంది. నవంబరు 23న ఫలితాలు వెల్లడించనున్నారు. ఈ నేపథ్యంలో, ప్రియాంక తరఫున ప్రచారం చేసేందుకు సోనియా కేరళ రానున్నారు. సోనియా చాన్నాళ్ల తర్వాత కేరళ వస్తుండడంతో రాష్ట్ర కాంగ్రెస్ వర్గాల్లో ఉత్సాహం నెలకొంది. సోనియా... తన కుమారుడు రాహుల్ గాంధీ, కుమార్తె ప్రియాంక గాంధీతో కలిసి ఎల్లుండి (అక్టోబరు 22) వయనాడ్ లో భారీ రోడ్ షోలో పాల్గొంటారు. ఈ రోడ్ షోను విజయవంతం చేయడానికి రాష్ట్ర కాంగ్రెస్ వర్గాలు భారీ ఏర్పాట్లు చేస్తున్నాయి. కాగా, వయనాడ్ లో ప్రియాంక గాంధీపై బీజేపీ యువనేత నవ్య హరిదాస్ ను బరిలో దించుతోంది.



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

# తెలంగాణలో మరో నాలుగు రోజుల పాటు వర్షాలు

**ప్రజా స్వేచ్ఛ**

ఉత్తర తమిళనాడు తీరానికి సమీపంలో సముద్ర మట్టానికి సగటున 5.8 కిలోమీటర్ల ఎత్తులో అల్పపీడనం ఏర్పడింది. సోమవారం నాటికి అల్పపీడనం ఏర్పడి, 23వ తేదీ నాటికి ఉత్తర వాయువ్యానికి కదులుతుంది. ఈ అల్పపీడనం ప్రభావంతో ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జైశంకర్ భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, నల్గొండ, మహబూబ్‌నగర్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, హైదరాబాద్, నాగర కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబగద్వాలలో ఉరుములు, మెరుపులతో



కూడిన ఈదురు గాలులు వీచే అవకాశం ఉంది. ఆదివారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జైశంకర్ భూపాలపల్లి, వరంగల్, హన్మకొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మల్కాజిగిరి జిల్లాల్లో వర్షం కురిసే అవకాశం ఉంది. అదనంగా, సోమ, మంగళవారాల్లో పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. ప్రభావిత ప్రాంతాలకు ఎల్లో అలర్ట్ ప్రకటించారు.




# సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందజేత

**ప్రజా స్వేచ్ఛప్రతినిధి/ భువనగిరి నియోజకవర్గం**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని ఆరూరు గ్రామంలో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆరూరు గ్రామ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మరణించిన సిపిఐ సీనియర్ నాయకులు కామ్రేడ్ గొడుగు లక్ష్మయ్య కుటుంబాన్ని పరామర్శించి 5,000 రూపాయలు ఆర్థిక సహాయంఅందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి పోలేపాక యాదయ్య ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి సుద్దాల సాయికుమార్ గ్రామ శాఖ కార్యదర్శి మేడి దేవేందర్ మండల సమితి సభ్యులు బుర్ర మల్లేశం సిపిఐ సీనియర్ నాయకులు జక్కుల లక్ష్మయ్య పగిడి లింగయ్య గోడేటి ఐలయ్య బొలుగుల రాజు తదితరులు పాల్గొన్నారు.



# వంశీ ని అభినందించిన భద్రాద్రి కొత్తగూడెం

## జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఐపీఎస్.

-భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ సభ్యులు



**భద్రాచలం: అక్టోబర్ 20 ప్రజా స్వేచ్ఛ**

భద్రాచలం సిటీ స్టైల్ జిమ్ కు చెందిన మోడెం వంశి అనే ఇంటర్నేషనల్ పవర్ లిఫ్టింగ్ క్రీడాకారుడి ని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఐపీఎస్ మోడెం వంశీని భద్రాచలం సిటీ స్టైల్ జిమ్ కోచ్ జివి రామిరెడ్డిని మరియు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పవర్ లిఫ్టింగ్ సభ్యులైన వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ శివరామకృష్ణ ప్రసాద్ ని కోశాధికారి మహంతి వెంకటకృష్ణాజి ని అభినందించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ, మోడెం వంశి అనే నిరుపేద గిరిజన క్రీడాకారుడు మారుమూల గిరిజన ప్రాంతం నుంచి వెళ్లి ఇంటర్నేషనల్ పవర్ లిఫ్టింగ్ పోటీలలో బంగారు పతకాలు సాధించి, ఇండియాకు కీర్తి ప్రతిష్టలు తీసుకురావడం ఎంతో గర్వించదగ్గ విషయం అని పేర్కొనటం జరిగింది. మోడెం వంశీని వచ్చే మార్చ్ లో జరిగే ఇంటర్ కంప్లీట్ చేయటం తో పాటుగా డిగ్రీ కూడా చదివి మంచి ఉద్యోగం సాధించమని ఆశీర్వదించారు. రాబోయే రోజుల్లో మారుమూల గిరిజన ప్రాంతాలలో ప్రజలు కొరకు నిర్వహించే అవగాహనా కార్యక్రమాలలో వంశీని కూడా ముందుకు రమ్మని ఆహ్వానించారు. ప్రభుత్వం, ప్రజలు, అసోసియేషన్ లు కలగలిపిన సాయం ఉంటే మారుమూల ప్రాంతానికి చెందిన గిరిజన యువకుడు వంశీ అంతర్జాతీయ స్థాయికి ఎలా వెళ్ళాడో, అదే ప్రాంతంలో నివాసంగా వుండే గిరిజనులకు ఉదాహరణ గా వంశీని ఆదర్శప్రాయంగా అందరికీ పరిచయం చేద్దాం అని అసోసియేషన్ సభ్యులకు తెలియచేసారు. భవిష్యత్తు లో వంశీ కి ఎలాంటి సాయం కావాలన్నా తనను కలవమని ఈ కార్యక్రమం లో తెలియచేసారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ జివి రామిరెడ్డి వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ శివరామకృష్ణ ప్రసాద్ కోశాధికారి మహంతి వెంకట కృష్ణాజి ( సీనియర్ నేషనల్ పవర్ లిఫ్టర్) పాల్గొనడం జరిగింది.

# ఘనంగా గీత పనివారల సంఘం 67వ వార్షికోత్సవం



**నేరేడుచర్ల ప్రజా స్వేచ్ఛ పత్రిక ప్రతినిధి :**

నేరేడుచర్ల పట్టణంలోని ఘనంగా గీత పనివారాల సంఘం 67వ వార్షికోత్సవం నిర్వహించగా.... కార్యక్రమానికి హాజరైన సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు మాట్లాడుతూ కల్లుగీత వృత్తిలో జీవిస్తున్న నిరుపేదలైన గీత పనివారలను దేశవ్యాప్తంగా సమీకరించి సంఘాన్ని నిర్మించిన నల్లగొండ మాజీ పార్లమెంట్ సభ్యులు బొమ్మగాని ధర్మభిక్షం స్ఫూర్తితో ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని ఆయన సూచించారు. వృత్తి వనం, ఉపాధి గ్యారెంటీ, ఆధునీకరణ, ఆర్థిక సహకారం వృత్తిదారుల సంక్షేమానికై ఐక్య ఉద్యమాలు నిర్మిద్దామని, ఈనాడు గీత కార్మికులు పొందుతున్న అనేక సంక్షేమ చట్టాలు దర్మభిక్షం నాయకత్వంలో సాధించుకున్న వేనని ఆయన అన్నారు. ముఖ్యంగా గీత కార్మికులు చనిపోతే నేడు వస్తున్న ఎక్స్ గ్రేషియా గీత పని వారల సంఘం సాధించిన విజయం అని కల్లు నుంచి నీరా తయారు చేసేలా ఒప్పించింది కూడా గీత పనివారల సంఘమేనని అయితే ఇప్పుడు ఇస్తున్న ఎక్స్ గ్రేషియా కంటి తుడుపు చర్యలా ఉంది అని ఆయన అన్నారు. గీత కార్మికుడు తాటి చెట్టు పై నుండి పడి మరణిస్తే 10 లక్షల ఎక్స్గ్రేషియా అంగవైకల్యం కలిగితే రెండు లక్షల ఎక్స్ గ్రేషియా కల్పించి ఆ కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో తాటి ఈత వనాలను పెంచుకునేందుకు 5 ఎకరాల ప్రభుత్వ భూమి కేటాయించాలని, తద్వారా గీత కార్మికులకు జీవిత భద్రత లభిస్తుందని అలాగే పర్యావరణానికి కూడా ఎంతో మేలు జరుగుతుందని ఆయన అన్నారు. గీత కార్మికులందరికీ తాటిచెట్లు ఎక్కే యంత్రాలను ఉచితంగా అందించాలని, అలాగే సబ్సిడీపై బైకు లు సరఫరా చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. సేఫ్టీ మోకులు, గీత కార్మికులందరికీ అందించాలని కేవలం ఒకరిద్దరికి మాత్రమే అందించి ప్రభుత్వం చేతులు దులుపుకోవడం సరికాదని స్థానిక సొసైటీల ద్వారా సేఫ్టీ మోకులు అందించి గీత కార్మికులకు ప్రభుత్వం అండగా ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ముత్యాల భాస్కర్ గౌడ్, బెల్లంకొండ గోవిందు గౌడ్, వడ్డెగాని లింగయ్య గౌడ్ అయిల శ్రీనివాస్ గౌడ్ మరియు చిలక రాజు శ్రీను లు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా

## పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

**మునుగోడు అక్టోబర్ 20: ( ప్రజా స్వేచ్ఛ**

రైతు పంటతో సాహసం నిరంతరం శ్రమించి సాగు చేసిన పంట చేతికి అందే సమయంలో సకాలంలో వర్షం పడకపోవడం వల్ల పంట చేను వడలిపోయి పంట దిగుబడి రాకపోయి, అనేక వైరస్ ల బారిన బడిన చేదాకా వచ్చిన పంట చేజారిపోయినా రైతులు మరలా పంటతోసాహసం. రైతంగానికి తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ సూచించిన విధంగా రైతులు రాష్ట్ర వ్యాప్తంగా అధిక సాగు చేసిన రైతంగానికి పత్తి పంట మొదటి తీత మొదలయింది. పత్తి పంట చేతికి అందిన తర్వాత పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం వలన దళారులకు అమ్ముకోవలసినపరిస్థితి ఏర్పడుతుంది. చేతికి అందిన పంట మార్కెట్లో అమ్మే సమయంలో గిట్టుబాటు ధర లేకపోయినా పండించిన పంటను భద్రపరచుకునే అవకాశం లేక, తప్పనిసరి



పరిస్థితుల్లో సాగు చేసే సమయంలో అనేక పెట్టుబడులు పెట్టి రైతు సాగు చేస్తున్నాడు. పంట నిల్వ చేసుకునే సామర్థ్యం లేక పండించిన పంటను గిట్టుబాటు ధర లేకపోయినా పంటను రైతు అమ్మేస్తాడు. రైతంగం అభివృద్ధి చెందాలంటే రైతు ఒక ఎకరంలో సాగు చేసిన పంటను మొత్తాన్ని కొనుగోలు చేయాలి. ప్రస్తుతం ఇప్పుడు రైతు ఎకరంలో సాగుచేసిన పంటని మొత్తం కొనుగోలు చేయకుండా ప్రభుత్వ నిబంధనలు పెట్టి మిగతా సగాన్ని పంటను దళారులకు అమ్మవలసిన పరిస్థితి. దళారులకు ఈ విధంగా రైతుల నుంచి పంటను కొనుగోలు చేసే అవకాశం దొరుకుతుంది. ప్రభుత్వం దళారీ వ్యవస్థను పూర్తిగా కట్టడి చేసి, తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, రైతు పండించిన పంటను ఆత్మగౌరవంగా అమ్ముకునే విధానాన్ని ప్రభుత్వం తీసుకురావాలని గ్లోబల్ అగ్రి ఇన్నోవేటివ్ రీసెర్చ్ ఫార్మ్ వ్యవస్థాపక అధ్యక్షులు రాఘవేందర్

# టీచర్ ఎక్సలెంట్ అవార్డు

## 2024 అవార్డుకు ఎంపికైన దూడల వెంకటేష్ గౌడ్

**ఆలేరు అక్టోబర్ 20: ప్రజా స్వేచ్ఛ**

మండల కేంద్రంలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు స్కూల్ అసిస్టెంట్ ఎన్సిసి అధికారి గా విధులు నిర్వహిస్తున్న దూడల వెంకటేష్ గౌడ్ టీచర్ ఎక్సెంట్ అవార్డు 2024 కు ఎంపికయ్యారు. ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని శారద ఎడ్యుకేషనల్ సొసైటీ మరియు స్కై బిర్లా ఫౌండేషన్ ఆడిటోరియంలో నిర్వహించే కార్యక్రమంలో అవార్డులు అందజేయున్నట్లు శారద ఫౌండేషన్



నిర్వాహకులు తెలిపారు. 2019 నుండి అవార్డులు అందజేస్తున్నట్లు తెలుపుతూ రాష్ట్రస్థాయిలో జరిగే ఈ కార్యక్రమానికి కేంద్ర, రాష్ట్ర మంత్రులు కిషన్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ గౌడ్, ప్రొఫెసర్ కోదండరామ్ లు హాజరై అవార్డు లు అందజేస్తారని వారు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మంజుల, ఉపాధ్యాయుల బృందం తదితరులు వెంకటేష్ గౌడ్ ని అభినందించారు.

## గచ్చిబౌలి: బిర్యానీలో ప్రత్యక్షమైన కప్ప



**శేరిలింగంపల్లి, అక్టోబర్ 20 ప్రజా స్వేచ్ఛ**

శేరిలింగంపల్లి నియోజకవర్గంలో గచ్చిబౌలి కదాంబ మెస్సులో బిర్యానీలో ఇదివరకు బొద్దింక, బల్లీ దర్శనం ఇవ్వడం చూశాం.. కానీ ఏకంగా బిర్యానీలో కప్ప ప్రత్యక్షమైంది. ఈ ఘటన గచ్చిబౌలి ఐఐఐటీలోని కదాంబ మెస్లో చోటుచేసుకుంది. మెస్లో విద్యార్థులు బిర్యానీ తింటుండగా అందులో కప్ప కనిపించింది. దీంతో ఒక్కసారిగా విద్యార్థులు కంగు తిన్నారు. మెస్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కప్ప వచ్చిన ఫొటోను X వేదికగా విద్యార్థులు షేర్ చేశారు.

## BRS పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ KTR పిలుపు మేరకు మాజీ శాసనసభ్యులు డా,, గాదరి కిశోర్ కుమార్ ఆదేశానుసారం



**మద్దిరాల మండలం అక్టోబర్ 20 ప్రజా స్వేచ్ఛ**

కాంగ్రెసు ప్రభుత్వం రైతులకు ఇవ్వవలసిన వర్షాకాల సీజన్ కు సంబధించిన రైతుభరోసా డబ్బులను ఇవ్వకుండా ఎగ్గొట్టినందుకు నిరసనగా మద్దిరాల మండల కేంద్రంలో మండల పార్టీ అధ్యక్షులు = SA రజాక్ ఆధ్వర్యంలో సూర్యాపేట - దంతాలపల్లి రోడ్ పై నిరసన కార్యక్రమం నిర్వహించబడినది. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ బెజ్జంకి శ్రీరాం రెడ్డి, కోడి శ్రీను,రావుల వెంకన్న,సాహబ్ హుస్సేన్, జిలకర చంద్రమౌళి,వడ్డాణం మధుసూదన్, దామెర్ల వెంకన్న, వెలుగు వెంకన్న, సూరినేని తిర్మల్ రావు, రేసు వెంకన్న, సుంచు అవిలయ్య, మారెల్లి యాకయ్య , దగ్గుల వెంకన్న, మల్లాల నర్సయ్య, సంగని రవీందర్, BS ముదిరాజ్, సాధు భాస్కర్ రెడ్డి, శేరి మోహన్ రెడ్డి,కొలగాని వెంకన్న, మల్లాల రాంమూర్తి,ఉప్పలయ్య, బాషబోయిన నాగయ్య, చామకూరి యాకయ్య,గూడ అర్జున్ రెడ్డి, బుసాని ఉమామహేశ్వర్, శిరంశెట్టి అశోక్ , రాజేంద్రప్రసాద్, కోమరయ్య, పులిగిళ్ళ వెంకన్న,గోల్కొండ మల్లేష్, రాంపాక నాగరాజు, బొందెకొల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు పంపిణి



**ప్రజా స్వేచ్ఛ**
**అక్టోబర్ 20 గంభీరావుపేట**

గంభీరావుపేట మండలం గజ సింగవరం గ్రామానికి చెందిన దుబ్బాక శంకర్ గారికి సీఎం సహాయ నిధి కింద చెక్కు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు బోన్ల సత్యం జిల్లా ప్రధాన కార్యదర్శి మూల రామచంద్ర రెడ్డి సింగిల్ విండో డైరెక్టర్ రాగుల అంజిరెడ్డి sc cell మండల అధ్యక్షులు పంతం సురేష్ మాజీ ఎంపిటిసి పర్ష రాములు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పిట్ల వెంకటి ఆపరేని బాలయ్య పంతం రాజనర్స్ పంతం నాంపల్లి నరసయ్య రవి సంజీవ్ అంజయ్య సుధీర్ ముఖ్య నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన



## ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

**ఆలేరు అక్టోబర్ 20: ప్రజా స్వేచ్ఛ**

ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలోని పి ఎస్ సి ఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆలేరు పట్టణ కేంద్రంలోని మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అయినాల చైతన్య రెడ్డి, వైస్ చైర్మన్ పచ్చిమట్ల మదర్ గౌడ్, డైరెక్టర్లు చిలువేరు

# బిజినెస్

## ఎంజీ ఆస్టర్ కారు ధర కాస్ట్లీ.. నాలుగు నెలల్లో రెండోసారి..!




ప్రముఖ కార్ల తయారీ సంస్థ ఎంజీ మోటార్స్ తన కంపాక్ట్ ఎస్‌యూవీ ఎంజీ ఆస్టర్ ధర రూ.27 వేలు పెంచేసింది. ఈ ఏడాదిలోనే భారత్ మార్కెట్లో ఎంజీ మోటార్స్ తన ఎంజీ ఆస్టర్ ఫేస్ లిఫ్ట్ కారు ఆవిష్కరించింది. 49 పై చిలుకు సేఫ్టీ ఫీచర్లతోపాటు 14 లెవల్-2 అడాస్ ఫీచర్లు, పర్సనల్ ఏఐ అసిస్టెంట్‌తో వస్తోంది. ఎంజీ మోటార్స్ తన కంపాక్ట్ ఎస్‌యూవీ కారు ధర పెంచడం నాలుగు నెలల్లో రెండోసారి కావడం గమనార్హం.ఎంజీ ఆస్టర్ సావీ ప్రో 1.3 టర్బో ఏటీ (సాంగ్రియా రెడ్) వేరియంట్, సీవీటీ (ఐవోరీ), 1.5 సీవీటీ (సాంగ్రియా రెడ్) మోడల్ కార్ల ధరలు రూ.27 వేలు పెరుగుతాయి. మరోవైపు షార్ప్ ప్రో 1.5 లీటర్ల సీవీటీ (ఐవోరీ) ధర రూ.26 వేలు పెరుగుతుందని ఎంజీ మోటార్స్ తెలిపింది. ఇక సెలెక్టెడ్ 1.5 సీవీటీ (ఐవోరీ) ధర రూ.21 వేలు, షార్ప్ ప్రో 1.5 లీటర్ల మాన్యువల్ ట్రాన్స్ మిషన్ (ఐవోరీ) వేరియంట్ రూ.24 వేలు వృద్ధి చెందుతాయి ఇంకా సెలెక్ట్ 1.5 లీటర్ల మాన్యువల్ ట్రాన్స్‌మిషన్ (ఐవోరీ), షైన్ 1.5 లీటర్ల మాన్యువల్ ట్రాన్స్ మిషన్ (ఐవోరీ) వేరియంట్ ధరలు రూ.20 వేలు పెరుగనున్నది. ఈ ఏడాది జూన్ లో ఎంజీ ఆస్టర్ కారు ధర రూ.26,800 పెంచింది. ఎంజీ ఆస్టర్ కారు ధర రూ.9.98 లక్షల నుంచి రూ.18.35 లక్షలు (ఎక్స్ షోరూమ్) మధ్య పలుకుతుంది. కియా సెల్టోస్, హ్యుండాయ్ క్రెటా, మారుతి గ్రాండ్ విటారా, టయోటా హై రైడర్, హోండా ఎలివేట్, ఫోక్స్ వ్యాగన్ టైగూన్, స్కోడా కుషాక్ వంటి కార్లకు గట్టి పోటీ ఇవ్వనున్నది ఎంజీ ఆస్టర్. న్యూ ఎంజీ ఆస్టర్ కారు ఫ్రంట్ వెంటిలేటెడ్ సీట్లు, ఆటో డిమ్మింగ్ ఐఆర్వీఎం అండ్ వైర్ లెస్ ఫోన్ చార్జర్ వంటి పలు కొత్త ఫీచర్లతో వస్తోంది. 14 లెవల్-2 సేఫ్టీ ఫీచర్లు, 49ం సేఫ్టీ ఫీచర్లతోపాటు 360-డిగ్రీ అరౌండ్ వ్యూ కెమెరా, 10.1 అంగుళాల ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్ విత్ స్మార్ట్ 2.0 యూఐ వంటి ఫీచర్లు ఉంటాయి. వాతావరణం, వార్తలు, క్యాలికులేటర్, జియో వాయిస్ రికగ్నిషన్ సిస్టమ్ తోపాటు వాయిస్ కమాండ్స్, వైర్ లెస్ ఆండ్రాయిడ్ ఆటో, ఆపిల్ కార్ ప్లే కనెక్టివిటీకి మద్దతుగా ఇన్ ఫో టైన్ మెంట్ సిస్టమ్ పని చేస్తుంది.

## వినియోగదారులకు షాకే.. త్వరలో భారీగా పెరగనున్న సీఎన్‌జీ ధర..!

సీఎన్‌జీ వాహనదారులకు త్వరలో షాక్ తగలబోతున్నది. రాబోయే రోజుల్లో సీఎన్‌జీ ధర రూ.4 నుంచి రూ.6 వరకు పెరగనున్నది. అయితే, ఎక్సైజ్ సుంకం తగ్గించడంతో పెరుగుతున్న సీఎన్‌జీ ధరలను నియంత్రించేందుకు ప్రయత్నిస్తున్నట్లుగా సంబంధితర వర్గాలు పేర్కొన్నాయి. సీఎన్‌జీ సరఫరాలో ప్రభుత్వం 20శాతం కోత విధించింది. న్యాచురల్ గ్యాస్ భారత్‌లోని అరేబియా సముద్రం నుంచి బంగాళాఖాతం వరకు భూగర్భం, సముద్ర గర్భం నుంచి పైపుల ద్వారా సరఫరా అవుతున్నది. సీఎన్‌జీ ఓ రకమైన ముడిపదార్థం. ఆటోమొబైల్స్, ఇండ్లలో వంట గ్యాస్‌ని ఉపయోగించేందుకు సీఎన్‌జీగా మారుస్తారు. గెలసీ ఫీల్డ్ నుంచి ఉత్పత్తి చేసిన గ్యాస్ నగరాల్లోని రిటైల్ గ్యాస్ సరఫరాదారులకు పంపిస్తారు. ఈ గ్యాస్ సరఫరాలో ఏటా ఐదుశాతం కోత విధిస్తూ వస్తున్నారు.దేశీయ




వంటగ్యాస్ సరఫరా నిలకడగా ఉన్నది. దాంతో పెరిగే అవకాశం లేదు. కానీ, సరఫరాదారులు తక్కువగా సరఫరా అవుతున్నందున సీఎన్‌జీని కొనుగోలు ఖరీదుకానున్నది. దాంతోనే రాబోయే రోజుల్లో ధరలు పెరగనున్నట్లు తెలుస్తున్నది. త్వరలోనే మహారాష్ట్ర, జార?ండ్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. ఆ తర్వాత ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. ఈ క్రమంలో పెరుగుతున్న ధరలను కట్టడి చేసేందుకు ప్రభుత్వం జీఎన్‌జీపై ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. ముంబయి, ఢిల్లీతో పాటు పలు నగరాల్లోనూ సీఎన్‌జీపై ఆధారపడి వాహనాలు నడుస్తున్నాయి. ఈ క్రమంలో ధరల ప్రభావం ఓటర్లపై ప్రభావం పడకుండా చూడాలని ప్రభుత్వం భావిస్తుందని.. ఈ క్రమంలోనే సెంట్రల్ ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించే ఆలోచనలు ఉన్నట్లు చర్చ జరుగుతున్నది.

## స్టైలిష్‌గా బజాజ్ పల్సర్ ఎన్125.. ఇవీ డిటెయిల్స్..!

ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ బజాజ్ ఆటో తన బజాజ్ పల్సర్ ఎన్125 మోటారు సైకిల్ త్వరలో భారత్ మార్కెట్లో ఆవిష్కరించనున్నది. న్యూ పల్సన్ ఎన్125 మోటారు సైకిల్ అగ్రెసివ్ స్టైలింగ్‌తో వస్తోంది. ఎల్ఈడీ హెడ్ లైట్ తోపాటు ముందు ప్లాస్టింగ్ క్లాడింగ్ ఉంటుంది. బజాజ్ ఎన్150 నుంచి వీల్స్, బజాజ్ ఫ్రీడం 125 నుంచి డిస్ ప్లే ఇండికేటర్ ఉంటాయి. అంటే బజాజ్ ఎన్125 మోటారు సైకిల్ ప్రాథమికంగా ఇన్ బిల్ట్ బ్లూటూత్



కనెక్టివిటీ ఫీచర్‌తో వస్తోంది.బజాజ్ పల్సర్ ఎన్125 మోటారు సైకిల్ స్ప్లిట్ సీట్, సైడ్ ప్యానెల్, టెయిల్ సెక్షన్ మీద కొన్ని నూతన గ్రాఫిక్స్ ఉంటాయి. టీవీఎస్ రైడర్, హీరో ఎక్స్ ట్రీం 125 ఆర్ వంటి మోటారు సైకిళ్ల మాదిరిగా స్ప్లిట్ సీట్ కలిగి ఉంటుంది. దీని ధర రూ.90 వేల నుంచి రూ.1.10 లక్షల మధ్య (ఎక్స్ షోరూమ్) పలుకుతుందని భావిస్తున్నారు.

## చిన్నస్వామిలో చిత్తైన టీమిండియా.. డబ్ల్యూటీసీలో ర్యాంక్ ఎంతంటే..?

సొంతగడ్డపై ఎదురులేని టీమిండియా కు దిమ్మదిరిగే షాకిచ్చింది న్యూజిలాండ్. చిన్నస్వామి స్టేడియంలో ఆల్‌రౌండ్ షోతో భారత్‌ను 46 పరుగులకే ఆలౌట్ చేసిన కివీస్.. అనంతరం 107 పరుగుల లక్ష్యాన్ని ఆడుతూ పాడుతూ ఛేదించింది. దాంతో, బంగ్లాదేశ్‌పై టెస్టు సిరీస్ వైట్‌వాష్ చేసిన రోహిత్ సేనకు గర్వభంగం అయింది. అంతేకాదు సూపర్ విక్టరీ కొట్టిన న్యూజిలాండ్ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (%ఔజ% 2024-25)లో నాలుగో స్థానానికి దూసుకొచ్చింది. మరోవైపు ఊహించని విధంగా ఓటమి పాలైన టీమిండియా మాత్ర అగ్రస్థానం కాపాడుకుంది. ఇప్పటికే రెండు పర్యాయాలు ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ ఆడిన భారత్.. మూడోసారి కూడా రేసులో ఉంది. బంగ్లాను 2-0తో వైట్‌వాష్ చేసి ఫైనల్ అవకాశాల్ని మరింత మెరుగుపరుచుకుంది. అయితే.. న్యూజిలాండ్ ఇచ్చిన



షాక్‌తో టీమిండియా ర్యాంకుకు ఎసరు వచ్చేలా ఉంది. అయితే.. బెంగళూరులో ఓడినా సరే బేఫికర్ అన్నట్టు టాప్‌లోనే ఉంది. కానీ, తర్వాతి రెండు టెస్టుల్లో రోహిత్ శర్మ బృందం భారీ తేడాతో గెలిస్తే తప్ప డబ్ల్యూటీసీ ఫైనల్ అవకాశాలు

**మెరుగువపడవు.ఆక్సిజన్‌లా కొత్త ఊపిరి**

ఇక శ్రీలంక చేతిలో 2-0తో టెస్టు సిరీస్ కోల్పోయిన న్యూజిలాండ్‌కు తొలి టెస్టు విజయం కలిసొచ్చింది. డబ్ల్యూటీసీ ర్యాంకింగ్స్‌లో దిగజారిన కివీస్‌కు ఈ గెలుపు ఆక్సిజన్‌లా కొత్త ఊపిరి పోసింది. 8 వికెట్ల తేడాతో విజయం సాధించడం ద్వారా ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ పట్టికలో న్యూజిలాండ్ రెండు స్థానాలు పైకి ఎగబాకింది. ఇంగ్లండ్, దక్షిణాఫ్రికాలను దాటేసి నాలుగో స్థానంలో నిలిచింది. ప్రస్తుతం డబ్ల్యూటీసీ పట్టికలో భారత్ నంబర్ 1లో ఉండగా.. ఆస్ట్రేలియా, శ్రీలంకలు వరుసగా 2, 3 స్థానాల్లో ఉన్నాయి.

## ఫైనల్లో దక్షిణాఫ్రికా చిత్తు.. న్యూజిలాండ్ పొట్టి ట్రోఫీ కల సాకారం

తొలి సీజన్ నుంచి ఊరిస్తున్న మహిళల టీ20 వరల్డ్ కప్‌ను న్యూజిలాండ్ కొల్లగొట్టింది. ఎట్టకేలకు మూడో ప్రయత్నంలో కివీస్ పొట్టి కప్‌ను ఒడిసి పట్టి చాంపియన్‌గా అవతరించింది. ఆదివారం దుబాయ్‌లో జరిగిన ఫైనల్లో నిరుడు రన్నరప్ దక్షిణాఫ్రికా ను చిత్తుగా ఓడించి టైటిల్ ఎగరేసుకుపోయింది. ఐసీసీ ట్రోఫీల్లో సఫారీలకు అందని ద్రాక్షలా మిగిలిన ట్రోఫీని కివీస్ గద్దలా తన్నుకుపోయింది. 159 పరుగుల భారీ చేధనలో అమేలియా కేర్(24/3) విజృంభణతో సఫారీ జట్టు ఒత్తిడిలో పడిపోయింది. కెప్టెన్ లారా వొల్వార్ట్(33) మినహా ఏ ఒక్కరూ స్థాయికి తగ్గట్టు ఆడలేదు. టెయిలెండర్లు పోరాడినా జట్టు తొలి టైటిల్ కలను నిజం చేయలేకపోయారు.ఐసీసీ ట్రోఫీ ఫైనల్లో



దక్షిణాఫ్రికాకు మరోసారి గుండెకోత. జూన్ 30వ తేదీన భారత పురుషుల జట్టు చేతిలో ఎడెన్ మర్క్‌రమ్ సేన ఓటమిపాలై తొలి కప్‌ను చేజార్చుకుంది. ఇప్పుడు దక్షిణాఫ్రికా మహిళల జట్టు సైతం ఆఖరి మెట్టుపై తడబడి మరోసారి రన్నరప్‌గా వెనుదిరిగింది. మొదట బౌలింగ్‌ల్ విఫలమైన సఫారీ జట్టు అనంతరం బ్యాటింగ్‌లోనూ తడబడింది. న్యూజిలాండ్ నిర్దేశించిన 159 పరుగుల ఛేదనలో కెప్టెన్ లారా వొల్వార్ట్(33), తంజిమ్ బ్రిట్స్(17)లు ధాటిగా ఆడారు. రన్‌రేటు 7కు తగ్గకుండా ధనాధన్ ఆడారు. దాంతో, సఫారీ జట్టు 6 ఓవర్లకు వికెట్ కోల్పోకుండా 47 పరుగులు పిండుకుంది.

# స్పోర్ట్స్

## ధోనీ మాకే చెప్పలేదు.. అక్టోబర్ 31 వరకూ ఆగండి



ఇండియన్ ప్రీమియర్ లీగ్ అంటే గుర్తుకొచ్చే గొప్ప ఆటగాళ్ల జాబితాలో మహేంద్ర సింగ్ ధోనీ పేరు ముందు వరుసలో ఉంటుంది. తన ఆటతో, తన మేనియాతో ఐపీఎల్‌కు పిచ్చి క్రేజ్ తెచ్చాడు మహీ భాయ్. అంతేనా చెన్నై సూపర్ కింగ్స్ ను ఏకంగా ఐదుసార్లు చాంపియన్‌గా నిలిపిన వీరుడు అతడు. అయితే.. 18వ సీజన్‌లో ధోనీ ఆడడంపై సందేహాలు నెలకొన్నాయి. ఒకవేళ ఆడినా అన్‌క్యాప్డ్ ప్లేయర్‌గా బరిలోకి దిగుతాడా? అందుకు బీసీసీఐ అనుమతిస్తుందా? అనే ప్రశ్నలు అభిమానుల్లో ఒకింత ఆసక్తి రేపుతున్నాయి ఈ నేపథ్యంలో చెన్నై సూపర్ కింగ్స్ సీఈఓ కాశీ విశ్వనాథన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ధోనీని అట్టిపెట్టుకోవడంపై ఆయన ఏం అన్నాడంటే..? తన మార్క్ కెప్టెన్సీతో చెన్నై జట్టుకు వన్నె తెచ్చిన ధోనీ 17వ సీజన్‌తో కెప్టెన్‌గా వైదొలిగాడు. వికెట్ కీపర్‌గానే కొనసాగుతూ ఫినిషర్‌గా తన ముద్ర వేశాడు. అయితే.. 18వ సీజన్‌లో ధోనీ అన్‌క్యాప్డ్‌గా ఆడుతాడు? అనే వార్తలు వైరల్ అవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో సీఎస్కే సీఈఓ కాశీ విశ్వనాథన్ స్పష్టత ఇచ్చాడు.'మేము కూడా ధోనీ సీఎస్కే తరఫున ఆడాలని కోరుకుంటున్నాం. కాన, ఆ విషయంపై ధోనీ ఓ నిర్ణయానికి రావాలి. ధోనీని రిటైన్ చేసుకుంటామా? లేదా? అనే విషయాన్ని అక్టోబర్ 31వ తేదీలోపు వెల్లడిస్తాను. మహీ వచ్చే సీజన్ కచ్చితంగా ఆడుతాడని మేము ఆశిస్తున్నాం' అని విశ్వనాథన్ ఓ ప్రకటనలో తెలిపాడు. 18వ సీజన్ మెగా వేలానికి ముందు ప్రతి జట్టు ఆరుగురిని మాత్రమే అట్టిపెట్టుకోవాలని బీసీసీఐ ఇప్పటికే ఫ్రాంచైజీలకు చెప్పింది. దాంతో, పలు జట్లు కీలక ఆటగాళ్లను రిటైన్ చేసుకోవాలని భావిస్తున్నాయి. సీఎస్కే కూడా ధోనీ, జడేజా, గైక్వాడ్‌లను అట్టిపెట్టుకోనుందనే వార్తలు వినిపిస్తున్నాయి




Printed, published and Owned by Tarigoppula Mahender, Printers Karshak Art Printers,Hyderabad
and Published by office 2-6-376, Jaipuri Colony, Nagole Village, Uppal Mandal, District Ranga Reddy,Post GSI, 500068-Telangana
RNI No. APTEL/2012/46853. E Mail. ID: prajaswecha@gmail.com, Web Site, www.prajaswecha.com cell 9381910611,7989289492